# పద్ధతి

**జగదీష్ తో నాకెక్కువగా** పరిచయముండే అవకాశం లేదు. నేను రాష్ట్రప్రభుత్వోద్యోగిని. అతడు కొత్తగా కంట్రాక్టులు ప్రారంభించాడు. నాది సీటుకదలక్కర్లేని వుద్యోగం. అతడిది నిలకడగా ఒకచోట ఉండలేనిపని. నేను అర్థంలేదని తెలిసినా మధ్యతరగతి నిజాయితీకి విలువనిచ్చేమనిషిని. మనిషి పతనానికి నిజాయితీయే కారణమని అతడు నమ్ముతాడు. వున్నదానితో నాకు తృప్తివుంది. లేనిదానిపై అతడికాశ వుంది.

ఆయినా మా యిద్దరికీ బాగా పరిచయమైంది.

జగదీష్‌ని నేను మొదటిసారిగా మా ఆఫీసులోనే కలిసాను. ఏదో పనిమీద అక్కడికొచ్చి ఎంక్వయిరీకి నా సీట్లో కొచ్చాడు. మాటల సందర్భంలో అతడి అన్నయ్యా నేను క్లాస్‌మేట్సుమని తేలింది మాటవరుసకి ఇంటి కాహ్వానించాను. అతను వచ్చేశాడు

నాశ్రీమతి మంచి చొరవైన మనిషి నేనేమోముభావంగా వుంటాను. జగదీష్ రాక ఆమెకు చాలా సంతోషం కలిగించింది. మొదటిరోజునే ఇద్దరు ఎన్నో యేళ్ళ పరిచయమున్న వాళ్ళకులా చాలా సేపుమాట్లాడేసుకుంటే నాకాశ్చర్యం కూడా కలిగింది. అతడు వెళ్ళిపోయేక శ్రీమతి నాతో—ఇన్నాళ్ళకు కనీసం ఓమంచి స్నేహితునైనా సంపాదించారు. మిమ్మల్ని మెచ్చుకోవచ్చు-అంది.

జగదీష్‌కి వివాహమైంది కానీప్రస్తుతం భార్య ఊళ్ళోలేదు పురిటికి పుట్టింటి కెళ్ళింది. అతడెలాంటి కంట్రాక్టులు చేస్తున్నాడో ఏమోగానీ వారానికి నాలుగు సార్లైనా విధిగా మాయింటికి వచ్చి వెడుతున్నాడు. అతడిరాక ఒక విధంగా నాకు చిరాకునే కలిగిస్తోంది. ఎందుకంటే చాలా విషయాల్లోమా అభిరుచులు కలవ్వు.


కానీ అతడికి కారుంది. మాయింటికి కార్లోనేవస్తాడు. నాకూ కార్లో ఇంటి కొచ్చే స్నేహితుడు వుండడం వల్ల ఇరుగు పొరుగుల్లో నా హోదా పెరిగింది. ఓసారి కార్లో అతడు నన్నూ, శ్రీమతినీ ఊరంతా తిప్పాడు. మరోసారి కార్లోనే మేముగ్గురం సినిమా చూసి వచ్చాం.

జగదీష్‌కి నేనంటే చాలా యిష్టం ఏర్పడింది. శ్రీమతి గురించి నేనూ అతడిపట్ల అయిష్టాన్ని ప్రకటించలేక పోయాను.

జగదీష్ శ్రీమతి అందచందాల్నీ గుణగణాల్నీ, వంటల్నీ విపరీతంగా పొగిడేసేవాడు. వాటిలో నిజమున్నా లేకపోయినా ఆపొగడ్తలు జగదీష్‌పట్ల శ్రీమతికి అభిమానాన్ని పెంచేశాయి.

అతడు నా జీవితవిధానం పట్ల అసంతృప్తిని ప్రకటించాడు. కావాలంటే శ్రీమతికుద్యోగం వేయిస్తానన్నాడు.

"ఆయనకి వేమీ నచ్చవన్నయ్యా-" అంది శ్రీమతి జగదీష్‌తో



"అంటే నీకు నచ్చాయన్నమాటే కదా-" అన్నాన్నేతను కాస్త బాధగా

"ఎందుకునచ్చవండీ? ఎందుకూపనికి రానివాడు రాజకీయ నాయకుడవుతున్నాడు. పది మంది పొట్ట కొట్టేవాడు వాడికి బాసటగా నిలుస్తున్నాడు. వాళ్ళిద్దరూ కలిసి తయారు చేసిన చట్టాన్ని గుడ్డిగా నమ్మేవాడు మేకులా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండి పోతున్నాడు—" అన్నాడు జగదీష్.

నేనేం మాట్లాడలేదు.

"ఆయనకెందుకు చెబుతారన్నయ్యా- ఇలాంటిమాటలాయన ఈ చెవిలోంచి విని ఆ చెవి లోంచి వదిలేస్తారు-" అంది శ్రీమతి నిష్ఠూరంగా.

నేను నవ్వి ఊరుకున్నాను. నా మనస్తత్వపు పరిమితులు నాకు తెలుసు. అందుకే నేను పెద్ద పరుగులు పెట్టను

అప్పుడుజగదీష్ శ్రీమతితో-"మీరేమీ అనుకోకపోతే నాలుగు రోజుల పాటు వారిని మీవారిని పూర్తిగా నాకొదిలి

వసుంధర

పెట్టండి. అప్పుడాయనెలా మారిపోతాడో చూడండి-" అన్నాడు.

నేను భయంగా శ్రీమతి వంక చూశాను. ఆఫీసు తర్వాత యిల్లే నా ప్రపంచం ఆ ప్రపంచానికి దూరం కావడం నాకిష్టంలేదు.

"నేనొదలడానికాయనేమైనా చంటి పిల్లడా? ఆయనలో మార్పు తెచ్చావంటే నేను మీకు ఋణపడి ఉంటాను-" అంది శ్రీమతి.

ఆవిధంగా నేను జగదీష్‌తో తిరగడం ప్రారంభమైంది

జగదీష్ ముందుగా ఓ ధర్మ సూత్రం చెప్పాడు నాకు.

ఎన్నికల్లో నెగ్గడం కోసం రాజకీయ నాయకుడు నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తాడు. అవి నిజంకాదని ప్రజలకు తెలిసినా అతడికి ఓట్లేస్తారు. తను చెప్పేది నిజం కాదని ప్రజలకు తెలుసునని రాజకీయ నాయకుడికీ తెలుసు. అయినా అతడలా చెప్పడానికి సిగ్గుపడడు.

రాజకీయాల్లో కానీ, వ్యాపారంలో కానీ, జీవితంలో కానీ పైకి పోవాలంటే సిగ్గు వదలి పెట్టాలి. ఎదుటివాడు మన గురించి ఏమనుకుంటున్నాడో అని పట్టించుకోకూడదు

జగదీష్ ముందీ ధర్మ సూత్రం వివరించేక నన్ను కొందరు గొప్పవాళ్ళ యిళ్ళకు తీసుకుని వెళ్ళాడు. అతడి పరిచయాలు చూసేక అతడి ముందు నేనెంత చిన్నవాణ్ణో అనిపించింది.

"జీవితంలో పైకి పోవడానికి సిగ్గు వదిలిపెట్టడం మొదటి పాయింటు. పరిచయాలు రెండో పాయింటు. గొప్ప గొప్ప వాళ్ళ పరిచయాలు మనహోదానూ పెంచుతాయి. అవసరాలను తీర్చుతాయి-" అన్నాడు జగదీష్.

"అదినిజమే-కానీ ఆ పరిచయాలెలా ఏర్పడతాయి?" అన్నాను.

"అందుకు ఆడవాళ్ళనే పట్టాలి. వాళ్ళు పొగడ్తలకు సులభంగా లొంగిపోతారు. ఒకసారి ఆడవాళ్ళు మనధారికి నచ్చేక మగవాళ్ళ చేత ఏ పనులైన చేయించుకోవచ్చు-" అన్నాడు జగదీష్.

అప్రయత్నంగా నాకు జగదీష్ శ్రీమతిని పొగడ్డం గుర్తుకొచ్చింది. కొంపదీసి జగదీష్ నా నుంచే ప్రయోజనాన్నో ఆశించడం లేదుకదా! నేనుగొప్పవాణ్ణి కాకపోవచ్చు కానీ ఆఫీసులో నాకు కొంతపలుకుబడి ఉంది. అది జగదీష్‌కు ఉపయోగ పడగలదు.


జగదీష్ తనరహస్యాన్ని నాకెందుకు చెప్పేశాడు? నేను తనని అనుమానిస్తానని భయంలేదా? లేక అతడికి నానుంచి ఏ ప్రయోజనమూలేదా?

అయితే జగదీష్ చెప్పనే చెప్పాడు. సిగ్గువదిలిన వాడు తన రహస్యం ఎదుటి వాళ్ళకు తెలిసినా పట్టించుకోరని! కానీ నేను జగదీష్‌ని నిలదీసి అడగడానికి మొహమాటం అడ్డు వచ్చింది.

"మిస్టర్ జగదీష్! నువ్వు నానుంచి ఏదైనా ప్రయోజనం ఆశిస్తూంటే అందుకు పరిచయం సహకరించదు. మన పరిచయాన్ని కొనసాగించేముందు నీవిషయం గుర్తుంచుకోవాలి-" అతడికి చెప్పాలనుకున్నాను కానీ అంత సూటిగా చెప్పలేక పోయాను.

ఆ తర్వాత జగదీష్ పెద్ద వాళ్ళ యిళ్ళకు వెళ్ళినప్పుడల్లా కూడా చిరు కానుకలు తీసుకుని వెడుతూండేవాడు.





వాటిగురించి కూడా నాతో చెప్పాడు.

"ఆఫీసులో వందలూ, వేలు అడిగే అధికారిని ఈ చిన్న చిన్న కానుకలు మొహమాటపెడుతుంటాయి. అందుకే ఆడ వాళ్ళ పరిచయమన్నాను. వాళ్ళు కానుక ఎంత చిన్నదైనా పుచ్చుకుంటారు. మగాళ్ళకైతే ప్రిస్టేజి బాధ ఉంటుంది ఆడాళ్ళకు పుచ్చుకోవడం దగ్గర ప్రిస్టేజి బాధ ఉండదు..." అని జగదిష్ వివరించగానే అతడి పద్ధతి నాకు పూర్తిగా అర్థమయింది.

అలా కొన్నాళ్ళు తనతో తిప్పుకున్నాక జగదీష్ ఒకరోజున నాతో—"నేను చాలా మొహమాటస్థుణ్ణి. ఎవరినైనా సాయం కావలిస్తే సూటిగా అడగలేను. డొంక తిరుగుడు పద్ధతిలో చెబుతాను. తెలివైన వాళ్ళు అర్థంచేసుకుని నాకు సాయపడి వాళ్ళు బాగుపడతారు. అయినా ప్రయోజనం లేనిదే నేనెవరితోనూ పరిచయం పెంచుకోనని నా పరిచయస్థులందరికీ తెలుసు. అందువల్ల సాధారణంగా వాళ్ళే నా అవసరమేమిటో అడిగి తెలుసుకుంటూంటారు-" అని చెప్పాడు.

అప్పుడు నాకు జగదీష్ పూర్తిగా అర్థమయ్యాడు. నానుంచి ఏదో ప్రయోజనాన్నాశిస్తున్న విషయం చెప్పడానికే ఇంత కాలమూ అతడు నన్ను తనతో తిప్పుకుని పద్ధతులు తెలియబరిచాడు. నేనిప్పుడతడి అవసరం తెలుసుకుని సాయపడాలని సూచిస్తున్నాడు.

"మిస్టర్ జగదీష్! నేనూ మొహమాటస్థుణ్ణే. కానీ అన్నీ కాకపోయినా ఇప్పుడు మీనుంచి కొన్ని నేర్చుకున్నాను. నా మనసులోమాట నేను సూటిగా చెప్పలేను. ఎలా చెప్పాలా అనుకుంటే పద్ధతి మీరే తెలియ జెప్పారు. పదండి—మాయింటికి వెళ్ళి మాట్లాడుకుందాం." అన్నాను.

అప్పుడు జగదీష్ మొహం వికసించింది. నాతో ఉత్సాహంగా యింటికి బయల్దేరి వచ్చాడు.

అతణ్ణి కూర్చోబెట్టి కాఫీ యిచ్చేక—నేను లోపలకు వెళ్ళాను. జగదీష్ ఉత్సాహంగా శ్రీమతితో మా డ్రాయింగ్ రూం అలంకరణ గురించి మాట్లాడుతున్నాడు.

నేను తిరిగి వచ్చి-"మిస్టర్! జగదీష్! మీరు నాతో పరిచయం కొనసాగించాలనుకుంటే ఇది వెనక్కి తీసుకోండి-" అన్నాను.

జగదీష్ నా చేతిలోని ఒత్తిడి ఫ్లవర్ వాజ్‌ను చూసి ఉలిక్కి పడ్డాడు. అది అతడు ఓరోజున శ్రీమతికి కానుకగా ఇచ్చాడు.


జగదీష్ నావంకా, నా చేతిలోని ఫ్లవర్ వాజ్ వంకా చూస్తున్నాడు.

"నా మనసులోని మాట నేనూ సూటిగా చెప్పలేను. ఎలా చెప్పాలా అనుకుంటే పద్ధతి మీరే తెలియ జెప్పారు-" అన్న నా మాటలు అతడి చెవుల్లో గింగురుమంటూండి ఉండాలి.

అప్పుడు జగదీష్ ఫ్లవర్ వాజ్ తీసుకోనూ లేదు. ఆ తర్వాత నాతో పరిచయం కొనసాగించనూ లేదు. జగదీష్ ధర్మమా అని ఆ తర్వాతెన్నడూ నేను శ్రీమతికి నన్నాఫీసులో అవినీతికి ప్రోత్సహించే అవకాశం మాత్రం యివ్వలేదు. *





TARA - CBNPW - 1310/83 - TEL